సాక్షి
అన్నమయ్య జిల్లా
శుక్రవారం । 21 । జూలై । 2023



గంగమ్మా..చల్లగా చూడమ్మా

రాజంపేటలోని బలిజపల్లెలో జరిగే గంగమ్మ జాతర సంబరం అంబరం అంటింది. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. - 8లో



రూ. 30 లక్షల విలువ చేసే 170 సెల్‌ఫోన్ల అప్పగింత

రూ. 30లక్షలు విలువ చేసే సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగించినట్లు జిల్లా ఎస్పీ గంగాధర్ రావు తెలిపారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.1030	రూ.1080
రెండోరకం	రూ.820	రూ.930

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 613 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	415	516
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 465.56 కిలోలు

మారిన మగ్గం బతుకులు

- చేనేత కుటుంబాలకు జగనన్న భరోసా
- నేడు ఐదో విడత నేతన్న నేస్తం నిధుల విడుదల
- అన్నమయ్యజిల్లాలో 6,937 మందికి రూ.16.65 కోట్ల లబ్ధి



మగ్గం నేస్తున్న నేత కార్మికురాలు

మదనపల్లె : వ్యవసాయం తర్వాత అధిక జనాభా ఉపాధి పొందుతున్న చేనేత రంగానికి రాష్ట్రప్రభుత్వం దన్నుగా నిలుస్తోంది. మగ్గం ఆడితే కానీ డొక్కాడని బతుకులు నేతకార్మికులవి అనేది ఒకప్పటి మాట. చేనేత కార్మికులకు వారి చేనేత పనులను మెరుగుపరిచేందుకు ఆర్థికసహాయం అందించడమే లక్ష్యంగా నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన నేతన్న నేస్తం వారికి కొండంత అండగా నిలుస్తోంది. జీవనప్రమాణాల్లో మెరుగైన మార్పులు తెస్తోంది. ప్రతి సంవత్సరం సొంతమగ్గాలు ఉన్న నేత కార్మికుల బ్యాంకుఖాతాలకు రూ.24,000 నేరుగా జమచేయడంతో ఐదేళ్లలో ప్రతి లబ్దిదారుడుకి ప్రభుత్వం నుంచి రూ.1.2లక్షల మొత్తం సహాయం అందుతోంది. శుక్రవారం ఐదో విడత వైఎస్సార్ నేతన్న నేస్తం పథకంలో భాగంగా నేత కార్మికుల ఖాతాల్లోకి నిధులు జమకానున్నాయి.

టీడీపీ ప్రభుత్వంలో సరైన ప్రోత్సాహం, ఉపాధి లేక ఇతర రాష్ట్రాలకు వలసపోవడమే కాకుండా అప్పుల బాధతో అనేకమంది నేతన్నలు బలవన్మరణాలకు పాల్పడిన ఘటనలు కోకొల్లలు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చేనేత కార్మికుల పరిస్థితి పూర్తిగా మారిపోయింది. వీరి జీవితాలకు బంగారు బాటలు వేసేలా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళికలు రూపొందించారు. వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని తీసుకొచ్చారు. దీంతోపాటు నూలు కొనుగోలు నుంచి తయారైన వస్త్రాలను మార్కెటింగ్ చేసే వరకు ప్రభుత్వం అన్ని దశల్లోనూ సహకారం అందిస్తోంది. ఫలితంగా పెద్దసంఖ్యలో చేనేత కార్మికులు లబ్ధి పొందడమే కాకుండా కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచుకుంటున్నారు. రాష్ట్రప్రభుత్వం వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద ప్రతి ఏడాది రూ.24,000 ఆర్థికసహాయంతో పాటుగా, నేత కార్మికులకు 50 ఏళ్లు దాటిని ప్రతి ఒక్కరికీ పెన్షన్ సదుపాయం కల్పిస్తోంది. వృత్తినైపుణ్యాలు మెరుగుపరచుకునేందుకు కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు సంయుక్తంగా క్లస్టర్‌లు ఏర్పాటుచేసి వెరైటీ డిజైన్లు, అధునాతన చీరలు నేసేందుకు అవసరమైన డిజైన్ కార్డులు, జాకార్ట్‌మిషన్లు, మోటార్లు తదితర పరికరాలను సబ్సిడీ ధరలపై అందిస్తున్నాయి. ఆప్కో ద్వారా వస్త్రాల కొనుగోలు చేస్తున్నారు. ఎన్‌హెచ్‌డీసీ ద్వారా సబ్సిడీపై సిల్కు, నూలు సరఫరా చేస్తున్నారు. రోజువారీ వ్యాపార అవసరాల కోసం మహిళాసంఘాలు, బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తున్నారు. కరోనా వంటి కష్టకాలంలోనూ నేతన్నలకు ఇచ్చిన హామీ ప్రకారం క్రమం తప్పకుండా సాయమందించారు.

అన్నమయ్యజిల్లాలో 6,937 మందికి లబ్ధి

అన్నమయ్యజిల్లాలో ఈ ఆర్థికసంవత్సరం వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద ఐదోవిడత నిధుల పంపిణీలో 6,937 మంది నేతన్నలకు రూ.16.65 కోట్లు లబ్ధి చేకూరనుంది. నేతన్నల మగ్గం ఆధునికీకరణ, నూలు కొనుగోలు తోడ్పాటును అందించేందుకు ప్రభుత్వం ఈ సాయం అందిస్తోంది.

జిల్లాలోని నియోజకవర్గాల వారీగా అందిన నేతన్న నేస్తం వివరాలు...

నియోజకవర్గం	లబ్ధిదారుల సంఖ్య	మొత్తం (రూ.లలో)
మదనపల్లె	4,252	10,20,48,000
తంబళ్లపల్లె	1,295	3,10,80,000
పీలేరు	267	64,08,000
కోడూరు	297	71,28,000
రాయచోటి	303	72,72.000
రాజంపేట	523	1,25,52,000

మూడేళ్లలో అన్నమయ్య జిల్లా నేతన్న నేస్తం వివరాలు...

సంవత్సరం	చేనేత కార్మికులు	లబ్ధి
2021	5,837	14,00,88,000
2022	6,118	14,68,32,000
2023	6,937	16,64,88,000

సీఎం సహాయాన్ని జీవితాంతం మరువలేం



నేతన్న నేస్తం పథకం కింద సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సహాయాన్ని జీవితాంతం మరచిపోలేం. నా భర్త సాంబాచారి 25 ఏళ్లుగా మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆరునెలల క్రితం డయాలసిస్‌వ్యాధితో మంచం పట్టారు. వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద వరుసగా నాలుగువిడతల్లోనూ 96వేలు సాయం అందింది. ఇంట్లోని పాతమగ్గం మొరాయిస్తే ప్రభుత్వం అందించిన సాయంతో కొత్తది కొనుగోలు చేశాం. దానిమీదే నేడు నేను మగ్గం నడుపుతూ ఆయనకు అవసరమైన మందుల కొనుగోలుతో పాటు కుటుంబ పోషణ చేసుకోగలుగుతున్నాను. ఈ పథకమే లేకుంటే మా కుటుంబం రోడ్డున పడే పరిస్థితి.

– వి.కుమారి, సిద్ధారెడ్డిగారిపల్లె, తంబళ్లపల్లె.

వృత్తి నైపుణ్యాలు మెరుగుపరుచుకున్నా..



జగనన్న ప్రతి సంవత్సరం ఇస్తున్న నేతన్న నేస్తం డబ్బులతో మగ్గానికి అవసరమైన డిజైన్ కార్డులు, జాకార్డ్ యంత్రం, మోటార్ కొనుగోలు చేశాను. వృత్తిపరంగా నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకుని, కొత్త డిజైన్లతో చీరలు నేస్తూ ఆదాయాన్ని పెంచుకున్నాను. కుటుంబపరిస్థితులు మెరుగుపడ్డాయి. నాలాగే తోటి నేత కార్మికులు ఆర్థికంగా ఎదిగారు. జీవితాల్లో మార్పు వచ్చింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.

– బి.పార్వతమ్మ, వెంకటేశ్వరపురం, మదనపల్లె.

ఆకాశమే హద్దుగా ఆవిష్కరణలు సాగాలి

ఇస్రో చైర్మన్ సోమనాథ్



మాట్లాడుతున్న ఇస్రో చైర్మన్ సోమనాథ్

కురబలకోట : శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించి రానున్న రోజుల్లో ప్రపంచాన్ని శాసించే స్థాయిలో విద్యార్థుల పాత్ర గణనీయంగా ఉండాలని ఇస్రో చైర్మన్ ఎస్. సోమనాథ్ పిలుపునిచ్చారు. గురువారం మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ అవేర్‌నెస్ (స్టార్ట్) కార్యక్రమాన్ని ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆన్‌లైన్ ద్వారా మాట్లాడుతూ అంతరిక్ష శాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తి, అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో స్టార్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. నూతన అధ్యయనాలు, ఆవిష్కరణలపై విద్యార్థులు, అధ్యాపకులు దృష్టి సారించాలన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో దేశాన్ని అగ్రగామిగా మార్చడంలో విద్యార్థుల పాత్ర కీలకమన్నారు. ఏ నూతన ఆవిష్కరణకైనా ముడిసరుకు సమాజమేనన్నారు. వనరులను వినియోగించుకుని తెలివి తేటలకు పదునుపెట్టి నూతన ఆవిష్కరణలు సృష్టించాలన్నారు. ఇప్పటినుంచి ఆగస్టు ఏడో తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భారతీయ విద్యా సంస్థలు, ఇస్రో శాస్త్రవేత్తలు శిక్షణ నిస్తారన్నారు. మిట్స్ కళాశాలను నోడల్ సెంటర్‌గా ఇస్రో ఎంపిక చేసిందని చెప్పారు. ఇస్రో శాస్త్రవేత్త ఎఎస్ కిరణ్ మాట్లాడుతూ దేశ విద్యార్థులను అంతరిక్ష, శాస్త్ర సాంకేతిక రంగాల్లో నిపుణులుగా మార్చడానికి ఈ స్టార్ట్ కార్యక్రమం దోహదపడుతుందన్నారు.

న్యూస్‌రీల్

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె సిటీ : జిల్లాలో అర్హత కలిగిన 9,10, ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న బీసీ, ఈబీసీ, సంచార జాతుల కులాలకు చెందిన విద్యార్థుల నుంచి పీఎం యశస్వి ఉపకార వేతనాలు పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ,సాధికారిత అధికారి బి.సందప్ప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన వారు వచ్చే నెల 10వతేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2.50 లక్షలు మించరాదన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వారు సెప్టెంబర్ 29వ తేదీన ప్రవేశపరీక్ష నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తారన్నారు. పూర్తి వివరాలకు https://yet.nta.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ పరిశీలనకు కేంద్ర బృందం

రాయచోటి : స్వచ్ఛ సర్వేక్షణ్ (గ్రామీణ్) లక్ష్యాల అమలును పరిశీలించేందుకు త్వరలో కేంద్ర బృందం జిల్లా పర్యటనకు రానుంది. ఈ విషయాన్ని డీపీఓ ధనలక్ష్మీ తెలిపారు. గురువారం ఈ మేరకు పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, అంగన్వాడీ వర్కర్లతో సమావేశమై గ్రామ పంచాయతీకి సంబంధించిన గ్రామ పటం ,గృహాల సంఖ్య, ఎస్సీ, ఎస్టీ, జనాభా తదితర వివరాల సేకరణపై పరిశీలిస్తూ గ్రామంలో పర్యటిస్తారన్నారు. జిల్లా నుంచి నామినేట్ అయిన 15 గ్రామ పంచాయతీల్లో ఓడీఎఫ్ ప్లస్ పరిశీలన జరుగుతుందన్నారు. జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు విస్తరణాధికారులకు (పీఆర్ అండ్ ఆర్‌డీ) కేంద్ర స్థాయి బృందం సందర్శన నిమిత్తం సమాయత్తం కావాలని ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి తెలిపారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

రాయచోటి : విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయుడు వి హుస్సేన్ బాషాపై విద్యాశాఖ అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి ఈమేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. రాయచోటి పట్టణం రాయుడు కాలనీలోని ఎంపీయూపీఎస్ ఉర్దూ పాఠశాలలో వి హుస్సేన్‌బాషా ఎస్‌జీటీగా పని చేస్తున్నాడు. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడే వారిపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తుండడంపై విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు జిల్లా విద్యాశాఖ అధికారులకు వారం రోజుల కిందట ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు త్రిసభ్య కమిటీతో విచారణ జరిపించారు. ప్రాథమిక నివేదిక ఆధారంగా సస్పెన్షన్ ఉత్తర్వులు ఇచ్చినట్లు సమాచారం.

అర్బన్‌హెల్త్ సెంటర్ల సేవలు సద్వినియోగం చేసుకోవాలి



వైద్యసిబ్బందిలతో మాట్లాడుతున్న లోకవర్ధన్

రాయచోటి అర్బన్: డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నమయ్య జిల్లా జాతీయ ఆరోగ్యమిషన్ పర్యవేక్షణాధికారి (డీపీఎంఓ) డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. గురువారం కొత్తపేట రామాపురం పట్టణ ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న పట్టణ ఆరోగ్యకేంద్రాల్లో ఓపీ సంఖ్య పెంచాలన్నారు. వార్డు వలంటీర్లు, ఆశాకార్య కర్తల ద్వారా అర్బన్ హెల్త్ సెంటర్లలో అందించే సేవల గురించి ఇంటింటికి సమాచారం అందేలా చూడాలన్నారు. ప్రతి అర్బన్ హెల్త్‌సెంటర్‌లో 172 రకాల మందులు, 60 రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. అంనంతరం అర్బన్ హెల్త్‌సెంటర్‌లోని స్టోర్‌రూం. రికార్డుగది, ల్యాబ్, లేబర్ రూములను పరిశీలించారు వైద్యుడు వసీమ్, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ ప్రవేశాల కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

వేంపల్లి: 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ట్రిపుల్ ఐటీ ప్రవేశాల కౌన్సెలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కె.సంధ్యా రాణి తెలిపారు. ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీకి సంబంధించి 1100 సీట్లు ఉండగా.. ప్రత్యేక కేటగిరీ మినహా 910 సీట్లకు ప్రవేశాలు ఈనెల 21, 22 తేదీలలో శుక్ర, శనివారాలు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు వారికి పంపిన కాల్ లెటర్లలో తెలిపిన విధంగా అన్ని ఒరిజినల్, నకలు సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, అందుకు సంబంధించిన ఫీజు తీసుకు రావాలని సూచించారు. అలాగే ఒంగోలు ట్రిపుల్ ఐటీకి సంబంధించి ఈనెల 24, 25 తేదీలలో ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ క్యాంపస్‌లోనే కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

టమాట ధరలపై కేంద్రబృందం పరిశీలన



మదనపల్లె మార్కెట్‌యార్డుకు వచ్చిన టమాట పంటను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

మదనపల్లె : రోజురోజుకీ పెరుగుతున్న టమాట ధరలపై అధ్యయనం చేసేందుకు, పెరుగుదలకు కారణమవుతున్న స్థితిగతులు, రవాణా సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఇద్దరు సభ్యులతో కూడిన కేంద్రబృందం గురువారం మదనపల్లెలో పర్యటించింది. మార్కెట్‌యార్డులో రైతులు అమ్మేందుకు తీసుకువచ్చిన టమాట పంటను, వ్యాపారులు కొనుగోలు చేసేందుకు నిర్వహిస్తున్న వేలంపాటలను పరిశీలించారు. అనంతరం న్యూఢిల్లీకి చెందిన కేంద్ర బృంద సభ్యులు బి.జే.బ్రహ్మ, హార్టికల్చర్ డిప్యూటీ కమిషనర్, ఎస్.కే.కౌల్, మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్, ఫార్మర్ వెల్ఫేర్ చీఫ్‌కన్సల్టెంట్‌లు మార్కెట్‌యార్డులో హార్టికల్చర్, మార్కెటింగ్‌శాఖ అధికారులు, మండీ యజమానులు, వ్యాపారులతో సమావేశమయ్యారు. టమాట ధరల పెరుగుదలకు కారణాలు, ప్రస్తుతం మార్కెట్‌కు వస్తున్న దిగుబడులు, అన్నమయ్యజిల్లాలో టమాట విస్తీర్ణం, రైతుల సమస్యలపై చర్చించారు. వ్యాపారులతో మదనపల్లె నుంచి ఢిల్లీ, కలకత్తా, చండీగఢ్‌కు రవాణాకు సంబంధించి రైలుమార్గాలను అడిగి తెలుసుకుని కిసాన్ రైలు ఏర్పాటుచేస్తే కలిగే ఉపయోగాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన అధికారి పి.రవిచంద్రబాబు మాట్లాడుతూ.. అధిక ఉష్ణోగ్రతలతో మే, జూన్‌లో చెట్లు ఎదుగుదల లేక, పూత, పిందె రాలిపోవడం, రసం పీల్చే పురుగుల ఉధృతి అధికం కావడం , చెట్టుఆకులు ముడుచుకుపోవడంతో కిరణజన్యసంయోగక్రియ జరగక లీఫ్ కర్ల్ వైరస్ సోకడంతో దిగుబడులు తగ్గాయన్నారు. గత ఏడాది మేలో టమాటా ధర ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఫిబ్రవరి, మార్చిలో పంటను అధికంగా సాగుచేయడంతో జూన్ 15కు దిగుబడులు తగ్గి మార్కెట్‌లో డిమాండ్‌కు సరిపడా సరుకు లభ్యత లేకపోవడంతో కిలో టమాటా రూ.145 వరకు వెళ్లిందన్నారు. తర్వాత కేంద్రబృంద సభ్యులు మండలంలోని వేంపల్లెలో పంట పొలాలను సందర్శించి... ఎటువంటి రకాలు వేస్తారు? పెట్టుబడి ఖర్చులు, గత ఏడాది ఆదాయ వ్యయాలు, ప్రస్తుత సంవత్సర స్థితి, కనీస మద్దతు ధర తదితర అంశాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టమాటా లభ్యత ఉన్న ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలో పర్యటించి అధ్యయనం చేసిన వివరాలపై నివేదిక తయారుచేసి కేంద్రప్రభుత్వానికి అందిస్తామన్నారు. కార్యక్రమంలో మదనపల్లె ఉద్యానఅధికారి ఈశ్వర్‌ప్రసాద్, బి.కొత్తకోట ఉద్యాన పరిశోధనస్థానం శాస్త్రవేత్త బాలాహుస్సేన్, మార్కెటింగ్‌శాఖ జేడీ రామాంజులు, ఏడీ త్యాగరాజు, సెక్రటరీ అభిలాష్, వ్యాపారులు, రైతులు పాల్గొన్నారు.

నగరవనం పనులు త్వరగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



రాయచోటి సమీపంలో నిర్మిస్తున్న నగరవనం పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : జిల్లా కేంద్రమైన రాయచోటి ప్రాంత ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని కలిగించేందుకు నిర్మించే నగరవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం పట్టణ సమీపంలోని అబ్బవరం వద్ద నిర్మించే నగరవనాన్ని, కంచాలమ్మ గండి చెరువులో బోటింగ్, వాకింగ్ ట్రాక్ తదితర పనులను కలెక్టర్ పరిశీలించారు. అన్నమయ్య జిల్లా ఏర్పడిన తరువాత రాయచోటి పట్టణంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు, అందులో భాగంగా గాలివీడు రోడ్డు అబ్బవరం వద్ద దాదాపు 76 ఎకరాలలో నిర్మించే నగరవనాన్ని రూ. 3 కోట్లతో సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి అప్రోచ్ రోడ్డు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ అధికారులకు సూచించారు. కంచాలమ్మ గండి చెరువులో బోటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సోషల్ ఫారెస్ట్రీ, డివిజనల్ ఫారెస్టు ఆఫీసర్ నగమనీశ్వరి, తహసీల్దార్ ప్రేమంత్ కుమార్, డివిజినల్ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ రఘుశంకర్ పాల్గొన్నారు.

- జిల్లాలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో వంద శాతం ప్రగతి సాధించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి గర్భిణులు, బాలింతలు, పిల్లలలో రక్తహీనత నివారణ, జగనన్నకు చెబుదాం, స్పందన అర్జీల పరిష్కారం తదితర అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, జేసీలతో సమీక్ష నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ గిరీషా పీఎస్, డీఆర్‌ఓ సత్యనారాయణలు హాజరయ్యారు. వీడియోకాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ముఖ్యమైన 8 అభివృద్ధి సూచికల్లో నిర్దేశించిన లక్ష్యాలు సాధించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో జాతీయ రహదారులు, ప్రాధాన్యత భవనాల పూర్తికి వేగంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నాలుగులేన్ల రహదారి పనుల పరిశీలన

కలికిరి : తిరుపతి–మదనపల్లె నాలుగు లేన్ల జాతీయ రహదారి పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టరు, నేషనల్ హైవే అధికారులను జిల్లా కలెక్టరు గిరీషా పీఎస్ ఆదేశించారు. మండల పరిధిలో జరుగుతున్న నాలుగు లేన్ల హైవే పనులు, జేఎన్టీయూ కళాశాల, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల వద్ద జరుగుతున్న పనులను కలెక్టరు పరిశీలించారు. ఈ సందర్భంగా హైవేకు సంబంధించి ఇప్పటి వరకు జరిగిన, ఇంకా మిగిలిన పనుల వివరాలను కాంట్రాక్టరు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. జేఎన్టీయూ కళాశాల ప్రహరీ పనులను నెల రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు.అనంతరం సాంఘిక సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల ప్రహరీ తొలగించకుండా అడ్డుకుంటుండటంపై కళాశాల వద్దకు చేరుకుని ప్రిన్సిపాల్‌ను విచారించారు. జాతీయ రహదారికి కళాశాల కాంపౌండ్ ఎంత మేర అవసరమవుతోందో పరిసరాలను పరిశీలించారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న కాంపౌండ్ వాల్ తొలగింపునకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులకు ఇబ్బంది కలగకుండా ప్రహరీ గోడ పనులు పనులు జరుగుతున్నంత కాలం వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో విద్యార్థినులతో కలిసి మొక్కలు నాటారు. కలికిరి, వాల్మీకిపురం తహసీల్దార్లు భాగ్యలత, ఫిరోజ్ ఖాన్, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీనివాసులు, డీఈ చంద్రశేఖర్, ఏఈ మాధవ్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అంజలీదేవి పాల్గొన్నారు.

భూములు కోల్పోయిన రైతులను ఆదుకుంటాం

వాల్మీకిపురం : మదనపల్లె – తిరుపతి నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణం కోసం భూములు కోల్పోయిన బాధిత రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని జిల్లా కలెక్టర్ అన్నారు. గురువారం మండలంలోని పొట్టేకులవారిపల్లి జేఎన్‌టీయూ కళాశాల ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటించారు. వాల్మీకిపురం , కలికిరి తహసీల్దార్లు ఫిరోజ్‌ఖాన్, భాగ్యలత, సర్వేయర్ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంగ్లంపై పట్టు.. ఆత్మస్థైర్యానికి మెట్టు

- రోజుకో పదం...నేర్చుకో తక్షణం
- కొత్త కార్యక్రమానికి శ్రీకారం
- ప్రభుత్వ పాఠశాలల్లో అమలు



లర్న్ ఏ వర్డ్‌లో పదాలు గురించి తెలియజేస్తున్న ఉపాధ్యాయుడు (ఫైల్)

మదనపల్లె సిటీ: నేటి పోటీ ప్రపంచంలో ఆంగ్లభాషకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. నేడు ఎంత చిన్న కొలువు రావాలన్నా ఆంగ్లభాష తప్పనిసరైంది. అందుకే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టింది. అలాగే ఆంగ్లభాషా సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు 'లెర్న్ ఏ వర్డ్ ఏ డే (రోజుకో పదం నేర్చుకో) అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ విధానం ద్వారా విద్యార్థులకు రోజుకో ఆంగ్లపదం పరిచయం చేస్తారు. రోజువారీ పాఠాలు యథావిధిగా బోధిస్తూ ఆ కొత్త పదం గురించి విపులంగా వివరిస్తారు. ఈ పదానికి అర్థం, నానార్థాలు, వ్యతిరేక పదం తదితర వాటిని నేర్పుతారు. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా తరగతి గది కృత్యాలు తయారు చేయాల్సి ఉంటుంది. 15 రోజులకోసారి పరీక్ష, స్పెల్‌బీ కార్యక్రమం నిర్వహిస్తారు. గతంలోనే ఇంగ్లీషుభాషపై పట్టును పెంచేందుకు వీలుగా విద్యార్థులకు 'తెలుగు టు ఇంగ్లీషు'కు సంబంధించిన జిల్లాలో ఈ ఏడాది 17,750 ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు అందజేసింది.

ప్రభుత్వ బడుల్లో....

జిల్లాలో 2213 ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10 వ తరగతి వరకు1,54,789 మంది విద్యార్థులు చదువుతుండగా వీరికి లర్న్ ఏ వర్డ్ ఏ డే కార్యక్రమం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు ఆంగ్లభాషలో రాణించడానికి ఈ పద్ధతి మరింత ఉపయోగకరంగా ఉంటుందని ఉపాధ్యాయులు,ఆంగ్లభాషా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తరగతులను బట్టి పదాలు నేర్పడానికి ప్రత్యేకంగా జాబి తాను కూడా సిద్ధం చేశారు. ఈ జాబితాలో ఉన్న పదాలను విద్యార్థుల స్థాయిని బట్టి ఉపాధ్యాయులు పరిచయం చేస్తున్నారు. లెవెల్–1లో 1,2 తరగతులు, లెవెల్–2లో 3 నుంచి 5 తరగతులు, లెవెల్–3లో 6నుంచి 8 తరగతులు, లెవెల్–4లో 9,10 తరగతులు ఉంటాయి.

నిర్వహణ విధానం ఇలా..

- ప్రతి రోజూ మొదటి పీరియడ్‌లో ఒక కొత్త ఆంగ్లపదాన్ని విద్యార్థులకు పరిచయం చేయాలి.
- రెండో పీరియడ్‌లో పిల్లల చేత డిక్షనరీలో ఆ పదం అర్థాన్ని వెతికించాలి.
- లెవల్ 1 విద్యార్థులకు రెండో పీరియడ్ ఉపాధ్యాయుడు పదం యొక్క అర్థాన్ని వివిధ ఉదాహరణలతో ఎలా ఉపయోగించాలో విద్యార్థులకు వివరించాలి.
- ఆంగ్ల ఉపాధ్యాయుడు తన పీరియడ్‌లో పదాన్ని వివిధ సందర్భాల్లో ఎలా ఉపయోగించాలో తెలియజేయాలి. ఇదే క్రమంలో వివిధ పీరియడ్‌లో ఓరల్ డ్రిల్లింగ్, స్పెల్లింగ్ గేమ్ విద్యార్థులు డిక్షనరీ సహాయంతో పదం యొక్క పార్ట్ ఆఫ్ స్పీచ్ కనుక్కోవడం,వ్యతిరేక పదాలు, సమానార్థ పదాలు వెతకడం, పదాన్ని రిపీట్ చేయడం నేర్పించాలి. కార్యక్రమం కోసం విద్యార్థులు ప్రత్యేకంగా వంద పేజీల నోట్ బుక్ ఉంచుకోవాలి. దానిని ఉపాధ్యాయుడు తరచూ తనిఖీ చేయాలి. ఇంటి వద్ద పదాలను ప్రాక్టీస్ చేయమని ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. తర్వాత విద్యార్థులు ఆంగ్లభాష పట్ల పట్టు సాధించగలిగేలా చేయాలి.

ఆంగ్లంపై పట్టు సాధించవచ్చు



రోజుకో కొత్త పదాన్ని తెలుసుకోవడం వల్ల ఆంగ్లంపై మంచి పట్టు సాధించవచ్చు. దీని వల్ల విద్యార్థుల్లో ఆంగ్లంపై ఆసక్తి కలుగుతుంది. ప్రతి రోజు కొత్త పదాన్ని, దాని అర్థాన్ని ఉపాధ్యాయులు పిల్లలతో ప్రాక్టీస్ చేయిస్తారు. పాఠశాలలో నేర్చుకున్న పదాన్ని ఇంటి వద్ద కూడా ప్రాక్టీస్ చేయాలి. ఇలా చేస్తే ఆంగ్లంపైమంచి పట్టు వస్తుంది.

– సుబ్బారెడ్డి, హెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్, మదనపల్లె

కొత్త పదాలు నేర్చుకోవచ్చు



లర్న్ ఏ వర్డ్ డే మంచి కార్యక్రమం. రోజుకో కొత్త పదం నేర్చుకోవచ్చు. ఆంగ్లంలోని భాషాభాగాలపై పట్టు లభిస్తుంది.

–షేక్ సాదియా, 10వ తరగతి విద్యార్థి, జెడ్పీహెచ్‌ఎస్,మదనపల్లె

విద్యార్థులకు ఉపయోగకరం



లర్న్ ఏ వర్డ్ ఏ డే కార్యక్రమం వల్ల ఆంగ్లభాషాభివృద్ధి సాధ్యమవుతుంది. రోజూ ఓ కొత్త పదం నేర్చుకోవడం వాటి వినియోగంపై పిల్లలకు తర్ఫీదు ఇవ్వడం మంచి ఫలితాన్నిస్తోంది. విద్యార్థులకు చాలా ఉపయోగకరం.

– పి.మహమ్మద్‌ఖాన్, ఆంగ్ల ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్‌ఎస్, మదనపల్లె

క్లుప్తంగా

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు



తీవ్రంగా గాయపడ్డ ముకుందరాజు, రామకృష్ణరాజు

బి.కొత్తకోట : మండలంలోని జాతీయ రహదారి తుమ్మనం గుట్ట రైల్వేస్టేషన్ వద్ద బైక్‌ను కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వృద్ధులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. ములకలచెరువు మండలం బురకాయలకోట సమీప గంగ్రాజులపల్లెకు చెందిన ముకుందరాజు (65), రామకృష్ణరాజు (68) గురువారం సాయంత్రం బైక్‌పై గ్రామం నుంచి మదనపల్లె వైపు వెళ్తున్నారు. వీరు తుమ్మనం గుట్ట రైల్వేస్టేషన్ సమీపంలోని రాగానే మదనపల్లె నుంచి ములకలచెరువు వైపు వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు వృద్ధులకు తీవ్రగాయాలు కాగా వారిని చికిత్స కోసం 108లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

నందలూరులో..



ప్రమాదస్థలి వద్ద నందలూరు పోలీసులు

నందలూరు(రాజంపేట) : నందలూరు–రాజంపేట మధ్య ఉన్న చెయ్యేరు బ్రిడ్జిపై గురువారం స్కూటీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌లపై ప్రయాణించిన ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. నందలూరు పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. గాయపడ్డవారిని 108 వాహనంలో రాజంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఆటో ఢీకొని..

మదనపల్లె : ఆటో ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డ సంఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. అమ్మచెరువుమిట్ట జగన్‌కాలనీకి చెందిన ఎస్.బాబాజాన్(56) ద్విచక్రవాహనంపై వెళుతుండగా తట్టివారిపల్లె సమీపంలో ఆటో వెనుకవైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ బాబాజాన్‌ను స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంగమ్మా.. చల్లగా చూడమ్మా

- అంబరమంటిన బలిజపల్లె జాతర సంబరం
- దారులన్నీ వేడుకవైపే
- వేకువజాము నుంచి రాత్రి దాకా పోటెత్తిన జనం



బలిజపల్లెలో కిక్కిరిసిన భక్తులు



జాతరలో భక్తులకు దర్శనమిచ్చిన గంగమ్మ



జాతరలో పాల్గొన్న మేడా, ఆకేపాటి

రాజంపేట టౌన్ : పట్టణంలోని బలిజపల్లెలో గురువారం జరిగిన గంగమ్మ జాతర సంబరం అంబరమంటింది. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో జాతరకు తరలివచ్చారు. బుధవారం అర్ధరాత్రి నుంచే జాతర వేడుక ప్రారంభమైంది. ముందుగా జాతర నిర్వహణలో భాగస్వామ్యులైన నారపురెడ్డిపల్లె ప్రజలు పోతురాజును ఊరేగిస్తూ అమ్మవారికి నవధాన్యాలు తీసుకొచ్చారు. అనంతరం తుమ్మల అగ్రహారం మహిళలు గంగమ్మకు గండదీయలు తీసుకొచ్చారు. పై రెండు గ్రామాల ప్రజలు బలిజపల్లెకు చేరుకోవడం, ఈలోపు అమ్మవారి ప్రతిమ తయారు కావడంతో నిర్వాహకులు పూలరథంలో గంగమ్మను ఊరేగిస్తూ ప్రత్యేకంగా తయారు చేసిన వేపమండల గుడిలో కొలువుదీర్చారు. ఈ సందర్భంగా భక్తులు గంగమ్మకు ఇష్టమైన నైవేద్యాలను ఎదురుగుంభంగా సమర్పించి, గంగమ్మా..మము కరుణించమ్మా.. అంటూ వరపడ్డారు. అనంతరం అమ్మవారు గుడిలో కొలువుదీరగానే జాతర మరింత రద్దీగా మారింది. అప్పటికే దాదాపు కిలోమీటరు దూరం వరకు క్యూలైన్లో నిల్చునిఉన్న ఉన్న భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు త్వరపడ్డారు. ఈ సమయంలో భక్తులను అదుపుచేసేందుకు పోలీసులు శ్రమించాల్సి వచ్చింది. తుమ్మల అగ్రహారం మహిళలు తీసుకొచ్చిన గండదీయలను అమ్మవారికి చెల్లించగానే పోలీసు అధికారులు భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పించారు.

దారులన్నీ జాతరవైపే

బలిజపల్లె గంగమ్మ జాతరలో అమ్మవారికి వరపడితే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందువల్ల రెండు దశాబ్దాలుగా ఇక్కడి గంగమ్మ ఎంతో విశిష్టత సంతరించుకుని విరాజిల్లుతోంది. ఈ ఏడాది జాతర నిర్వహణ ఆలస్యమైనప్పటికీ గతంలో ఎన్నడూ లేని విధంగా భక్తులు పెద్దసంఖ్యలో వేడుకకు తరలివచ్చారు. బుధవారం రాత్రి నుంచే భక్తులు బలిజపల్లె గ్రామానికి వెళ్ళేందుకు ఉన్న నాలుగువైపులదారుల నుంచి రావడం మొదలుపెట్టారు. అప్పటినుంచి గురువారం రాత్రి దాకా దారులన్నీ జాతరవైపే సాగాయి. జాతరకు వచ్చిన జనంతో పట్టణంలో కూడా ఎటుచూసినా భక్తులే సందడే కనిపించింది.

గంగమ్మను దర్శించుకున్న ప్రజాప్రతినిధులు

జాతర సందర్భంగా ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి గంగమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గంగమ్మను ఏటా జాతరలో దర్శించుకునే భాగ్యం కలుగుతుండటం పూర్వజన్మ సుకృతమని వారు చెప్పారు. సీఎం వైఎస్ జగన్ ప్రజారంజక పాలనకు గంగమ్మ తల్లి ఆశీస్సులు మరింత మెండుగా ఉండాలని, సంవృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలకు సుఖ సంతోషాలు కలిగించాలని అమ్మవారిని వేడుకున్నట్లు మేడా, ఆకేపాటి, పోలా తెలిపారు.

భక్తుల ఆకలి, దాహార్తిని తీర్చిన మానవతా మూర్తులు

జాతర సందర్భంగా అనేక మంది మానవతా మూర్తులు తమ మానవత్వాన్ని చాటుకున్నారు. గంగమ్మ జాతరకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు బలిజపల్లె పరిసర ప్రాంతాల్లోనే కాక పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో భోజనం, పులిహోర వంటి ఆహార పదార్థాలను అందజేశారు. మరికొంత మంది మజ్జిగ, మంచినీరు, పానకం పంపిణీ చేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు.

అనారోగ్యంతోనే షామీర్‌బాషా మృతి



షామీర్‌బాషా (ఫైల్)

నిమ్మనపల్లె: మండలంలోని కొండయ్యగారిపల్లెకు చెందిన సత్తార్‌సాహెబ్ కుమారుడు ఎస్.షామీర్ బాషా (45) అనారోగ్య కారణాలతోనే మృతి చెందినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు అతడి కుమారుడు నవాజ్‌వల్లి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.భవన నిర్మాణ కార్మికుడిగా పని చేసే షామీర్‌బాషా (45) సారా తాగి మృతి చెందినట్లు పత్రికల్లో వార్తలు వచ్చాయి. అయితే తన తండ్రి అనారోగ్యంతోనే మృతి చెందినట్లు షామీర్‌బాషా కుమారుడు నవాజ్‌వల్లి నిమ్మనపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారం రోజులుగా తన తండ్రి తీవ్ర జ్వరం, కడుపునొప్పితో బాధపడుతూ ఆహారం తీసుకోలేక అపస్మారకస్థితికి చేరుకున్నట్లు అతడు చెప్పాడు. బుధవారం సాయంత్రం తన తండ్రిని నిమ్మనపల్లె పీహెచ్‌సీకి తీసుకెళ్లగా ప్రాథమిక చికిత్సల అనంతరం వైద్యులు మదనపల్లెకు రెఫర్ చేశారన్నారు. 108లో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అక్కడ పరీక్షించిన వైద్యులు మార్గమధ్యలో మృతి చెందినట్లు నిర్ధారించారని చెప్పారు.

కాగా, షామీర్‌బాషా కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్‌ఐ తెలిపారు. షామీర్ బాషా సారా తాగి మృతి చెందాడా? లేకపోతే ఆరోగ్య సమస్యలతో మృతి చెందాడా? అనే విషయం తెలుసుకునేందుకు శరీరభాగాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. షామీర్‌బాషా మృతిపై కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

ఆధిక్యంలో చిత్తూరు జట్టు



ఐదు వికెట్లు తీసిన చిత్తూరు బౌలర్ బ్రహ్మసాయి

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ–సౌత్‌జోన్ అంతర్ జిల్లాల అండర్–19 క్రికెట్ టోర్నమెంట్‌లో చిత్తూరు జట్టు ఆధిక్యంలో కొనసాగుతోంది. కేఓఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 29 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన నెల్లూరు జట్టు రెండోరోజు గురువారం 61.3 ఓవర్లలో 252 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని బ్యాట్స్‌మెన్లు అర్జున్ 92 పరుగులు, పవన్ రిత్విక్ 77 పరుగులు చేసి రాణించగా, చిత్తూరు బౌలర్ బ్రహ్మసాయి 5 వికెట్లతో మెరిశాడు. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 341 పరుగులు చేసిన చిత్తూరు జట్టు సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించి రెండోరోజు ఆట ముగిసే సమయానికి 28 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 114 పరుగులు చేసింది. దీంతో చిత్తూరు జట్టు 203 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. జట్టులోని భవానీప్రసాద్ 46, రెడ్డిరుషీల్ 48 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్ భార్గవ్ మహేష్ 3 వికెట్లు తీశాడు.

కర్నూలు జట్టుకు స్వల్ప ఆధిక్యం

వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 95 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన అనంతపురం జట్టు రెండోరోజు 82.1 ఓవర్లలో 321 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని దినకర్ 94, కరీంబాబా 66, లీలాసాయి 48 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్లలో దినేష్‌కుమార్ 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 37 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 148 పరుగులు చేసింది. జట్టులోని సాయి సూర్యతేజారెడ్డి 67 పరుగులతో రాణించాడు. అనంత బౌలర్ ప్రదీప్ 2, లీలాసాయి 2 వికెట్లు తీశారు. దీంతో కర్నూలు జట్టు 2 పరుగుల స్వల్ప ఆధిక్యంతో కొనసాగుతోంది.

ఆర్టీసీబస్సు ఢీకొని వ్యక్తి మృతి

మదనపల్లె : జీవనోపాధి కోసం పరాయి రాష్ట్రానికి వచ్చి... రోజంతా ఇటుకుల బట్టిలో కష్టపడి, నిద్రపోయేందుకు రూమ్‌కి వెళ్తున్న ఛత్తీస్‌ఘడ్ వాసిని ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు కబళించిన సంఘటన గురువారం రాత్రి కురబలకోట మండలంలో జరిగింది. రాయపూర్ జిల్లా బౌడి గ్రామానికి చెందిన సోను కుమారుడు ధర్మేన్ (22) కురబలకోట మండలం సర్కారుతోపు సమీపంలో కొంత కాలంగా ఇటుకల బట్టీలో పని చేస్తున్నాడు. ఇతను రాత్రి పని ముగించుకుని స్నేహితులతోపాటు తాము ఉంటున్న గదికి నడుచుకుని వెళ్తుండగా సర్కారుతోపు సమీపంలో కదిరి వైపు నుంచి మదనపల్లెకు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ధర్మేన్‌ను 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మార్గంమధ్యలోనే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

బైక్ బోల్తా పడి..



మృతిచెందిన జితేంద్ర

రైల్వేకోడూరు : మండలంలోని జ్యోతికాలనీ సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో యువకుడు మృతి చెందగా, మరొక యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మైసూరువారిపల్లెకు చెందిన జితేంద్ర(23) అలియాస్ చిన్నా, శెట్టిగుంటకు చెందిన మురళి మోటార్‌బైక్‌పై కోడూరు నుంచి కుక్కలదొడ్డికి బయలుదేరారు. మార్గమధ్యలో జ్యోతి కాలనీ వద్ద బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో జితేంద్ర అక్కడిక్కడే మృతి చెందాడు. మురళి తీవ్రంగా గాయపడగా అతడిని చికిత్స నిమిత్తం రేణిగుంట సమీపంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జర్నలిస్టులను దూషించిన వారిపై ఫిర్యాదు



అర్బన్ ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు

బద్వేలు అర్బన్ : జర్నలిస్టులను తరిమి తరిమి కొడతాం.. అంటూ వ్యాఖ్యలు చేసిన దళిత సంఘాల నాయకులపై బద్వేలు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా నాయకులు గురువారం అర్బన్ ఎస్‌ఐ కె.వెంకటరమణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు బి.వెంకటేష్, ఎ.క్రిష్ణకిషోర్, పి.సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ సుమారు పదేళ్ల క్రితం జర్నలిస్టులకు కేటాయించిన స్థలాల సమీపంలో ఏర్పడిన రహదారి సమస్యపై రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్న సమయంలో సంబంధం లేని దళిత సంఘాల నాయకులు జర్నలిస్టులను దుర్భాషలాడటం తగదన్నారు. పోలీసులు వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జర్నలిస్టు యూనియన్ నాయకులు కె.సాంబశివరావు, పూలబాబు, రాజన్న, సురేష్, మస్తాన్‌రెడ్డి, ప్రసాద్, అరుణ్, రఘు, శివ, కె.పి.ఎం.భాస్కర్, వెంకటేశ్వర్లు, జయప్రసాద్, వెంకటసుబ్బయ్య, హర్షబాబు, హుస్సేన్, మైఖేల్, రాజు, వెంకటసుబ్బయ్య, బాబు, కిషోర్, నరసింహ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

35 ఎర్రచందనం దుంగల స్వాధీనం



పట్టుబడ్డ వ్యక్తులు, ఎర్రచందనం దుంగలను చూపిస్తున్న అటవీశాఖ అధికారులు

వేంపల్లె : వేంపల్లె ఫారెస్ట్ రేంజ్ పరిధిలో గొర్లపల్లె బీట్‌లో 35 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు వేంపల్లె ఫారెస్ట్ రేంజ్ అధికారి బి.బాలసుబ్రమణ్యం గురువారం తెలిపారు. అందిన సమాచారం మేరకు బుధవారం రాత్రి గొర్లపల్లె అటవీ ప్రాంతంలో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు చెప్పారు. మొత్తం ఏడుగురు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు తరలిస్తుండగా దాడి చేశామన్నారు. వారిలో ఒకరు పారిపోగా మిగిలిన ఆరుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వెన్నపూస చంద్రశేఖరరెడ్డి అనే వ్యక్తి తప్పించుకోగా.. ఏకసిరి గంగయ్య, వై.పెద్ద గంగయ్య, ఒబిలగండ్ల నడిపి ఓబయ్య, నాగూరు లక్ష్మిరెడ్డి, త్రిపురవరం నరసింహారెడ్డి, బుసిరెడ్డి అమరేంద్రరెడ్డిలను అరెస్టు చేశామని, వారి వద్ద నుంచి 35ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు 597కేజీలు ఉన్నాయని, వీటి విలువ రూ.1.65లక్షలు ఉంటుందన్నారు. దుండగుల నుంచి ఒక ద్విచక్రవాహనాన్ని కూడా స్వాధీనపరుచుకున్నట్లు అధికారులు తెలిపారు. ఎర్రచందనం దుంగలను కడప రేంజర్ కార్యాలయానికి తరలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ గుర్రప్ప, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

టాటాఏస్ బోల్తా.. 8 నెలల బాలిక దుర్మరణం



వాహనం కిందపడి మృతి చెందిన చిన్నారి

చాపాడు : మండల పరిధిలోని నాగులపల్లె వద్ద మైదుకూరు – ప్రొద్దుటూరు జాతీయ రహదారిలో గురువారం టాటాఏస్ బోల్తా పడ్డ ఘటనలో 8 నెలల బాలిక మృతి చెందింది. అనంతపురం జిల్లా బత్తలపల్లెకు చెందిన వలస జీవుల కుటుంబం గురువారం పులివెందుల నుంచి బద్వేలుకు టాటాఏస్‌లో వెళుతుండగా నాగులపల్లె వద్ద బోల్తా పడింది. స్థానికులు వాహనంలో ఇరుక్కుపోయిన వారిని వెలికితీశారు. ప్రమాదంలో 8 నెలల పాప మృతి చెందగా, నలుగురికి గాయాలయ్యాయి.

రూ.30 లక్షల విలువ చేసే 170 సెల్‌ఫోన్ల అప్పగింత

- బాధితులకు అందజేసిన ఎస్పీ గంగాధర్ రావు
- వాట్సాప్‌కు ఒక మిస్డ్ కాల్ ఇస్తే చాలు
- దేశంలో ఎక్కడున్నా సెల్‌ఫోన్ రికవరీ
- ఇప్పటిదాకా రూ.1.2 కోట్లు విలువ చేసే 574 సెల్‌ఫోన్ల స్వాధీనం



బాధితులకు సెల్‌ఫోన్లు అందిస్తున్న ఎస్పీ గంగాధర్ రావు

రాయచోటి టౌన్ : సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నవారి ఫోన్లను రికవరీ చేసిన పోలీసులు గురువారం అన్నమయ్య జిల్లా ఎస్పీ గంగాధర్ రావు చేతులమీదుగా ఫిర్యాదుదారులకు అప్పగించారు. దీనిపై గురువారం మీడియా సమావేశం నిర్వహించిన ఎస్పీ వివరాలు వెల్లడించారు. గత కొద్దిరోజులుగా తమ సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నామని పలువురు ఫిర్యాదుచేశారని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరిపి పోగొట్టుకున్న వారి సెల్‌ఫోన్లను చోరీకి పాల్పడ్డవారి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారిని స్టేషన్‌కు పిలిచి అప్పగించినట్లు చెప్పారు. మొత్తం 170 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ సుమారు రూ. 30 లక్షలు ఉంటుందని ఎస్పీ వివరించారు. గతంలో మూడు దఫాలు బాధితులకు సెల్‌ఫోన్లు అందజేశామని, ఇప్పుడు అందజేస్తున్నది నాల్గవ దఫా అని చెప్పారు. ఇప్పటిదాకా మొత్తం రూ.1.2కోట్లు విలువ చేసే 574 సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగించామని తెలిపారు. మొదటి విడతలో రూ.23లక్షల విలువ చేసే 109 ఫోన్లు, రెండవ విడతలో రూ.26లక్షల విలువ చేసే 130 సెల్‌ఫోన్లు, మూడవ విడతలో రూ.33లక్షల విలువ చేసే 165 సెల్ ఫోన్లు, ఇప్పుడు నాల్గవ విడతలో రూ.30లక్షల విలువ చేసే 170 సెల్ ఫోన్లు అప్పగించినట్లు ఎస్పీ వివరించారు.

ఇప్పుడు వేగంగా సెల్‌ఫోన్ రికవరీ

గతంలో పోల్చితే ఇప్పుడు వేగంగా సెల్ ఫోన్ రికవరీ చేయవచ్చునని ఎస్పీ గంగాధర్ రావు చెప్పారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు వెంటనే 8688830012 వాట్సాప్‌కు ఒక మిస్డ్ కాల్ చేస్తే చాలు వారికి ఒక అప్లికేషన్ ఓపెన్ అవుతుందని అందులో ఆయా ఫోన్ సంబంధిత ఆధారాలను నమోదు చేస్తే చాలు వారి ఇచ్చిన ఆధారాల ప్రకారం సెల్‌ఫోన్ దేశంలో ఎక్కడ ఉన్నా సరే త్వరగా పట్టేసుకుంటామన్నారు.

సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు వద్దు

సోషల్ మీడియా (వాట్సాప్, ఫేస్ బుక్, ఇన్‌స్టాగామ్, ట్విట్టర్, టెలిగ్రాం) యాప్స్ ఉపయోగించి ఇతరుల గౌరవానికి భంగం కలిగించే విధంగా పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని ఎస్పీ హెచ్చరించారు. సోషల్ మీడియా గ్రూప్స్‌లో అసభ్యకర పోస్టులను షేర్ చేస్తే ..షేర్ చేసిన వారితో పాటు అడ్మిన్‌పై కూడా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

లైసెన్స్ లేనివారు యాసిడ్ అమ్మొద్దు

లైసెన్స్ లేకుండా యాసిడ్ అమ్మితే అటువంటి వారిపైన కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. లైబ్రరీల్లో, ఆస్పత్రుల్లో, ఇతర ప్రయోగశాలల్లో మాత్రమే దీనిని ఉపయోగిస్తారని చెప్పారు. ఇతరులు యాసిడ్‌ను అమ్మినా, కొన్నా అటువంటివారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. హోల్ సేల్ వ్యాపారులు యాసిడ్ ఎవరెవరికి అమ్ముతున్నారో వారి వివరాలు రికార్డు చేయాలని సూచించారు. ఇకపై విక్రయదారుల కోసం ఒక వాట్సాప్ క్రియేట్ చేయనున్నామని, అందులో యాసిడ్ అమ్ముతున్నవారి, కొంటున్నవారి ఫొటోలు అప్‌లోడ్ చేసేలా ఆదేశాలు ఇవ్వనున్నట్లు ఎస్పీ వివరించారు. అడిషనల్ ఎస్పీ డాక్టర్ రాజ్‌కమల్, ఎస్‌ఐ మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

సిబ్బందికి అభినందనలు

సెల్‌ఫోన్ల రికవరీకి కృషి చేసిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు. వారెంతో శ్రమించారని చెప్పారు. వారి కష్టానికి ఫలితంగా వచ్చే ఆగస్టు 15వ తేదీన రివార్డులతో పాటు నగదు బహుమతులు కూడా అందజేస్తామని ఎస్పీ తెలిపారు. ఈ టీమ్‌లో ఉన్న సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సబ్ ఇన్‌స్పెక్టర్ బి.బాలకృష్ణ, అండర్ టెక్నికల్ అనాలసిస్ బృంద సభ్యులు బి. నరసింహ నాయక్, రవి శేఖర్, ఎస్. అబ్దుల్ సాహుల్, షామీన్ అరాస్, ఇలియాస్, బీవీఎస్ చౌడేశ్వరిలను ఎస్పీ అభినందించారు.

కారును ఢీకొన్న లారీ



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

కొండాపురం : కొండాపురం సమీపంలోని తాడిపత్రి– కడప జాతీయరహదారిపై గురువారం లారీ కారును ఢీ కొంది. కారులోని ఎయిర్‌బ్యాగ్స్ ఓపెన్‌కావడంతో వాహనంలోని వారికి ప్రాణాపాయం తప్పింది. గాలివీడు మండలం ఒరిగపల్లెకు చెందిన ఫణికుమార్ భార్య పావనితో కలసి కారులో అనంతపురానికి బయలుదేరాడు. మార్గమధ్యలో కొండాపురం సమీపంలోని లక్ష్మీనరసింహ వేర్ హౌస్ ఎదురుగా ఉన్న మలుపు వద్ద వెళ్తుండగా కారును ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొంది. ఈ ఘటనలో కారు ముందుభాగం నుజ్జు నుజ్జు అయింది. కారులో ప్రయాణిస్తున్నవారు సీట్ బెల్ట్ పెట్టుకోవడంతో వాహనంలోని ఎయిర్‌బ్యాగ్స్ ఓపెన్ అయి సురక్షితంగా బయటపడ్డారు.

విద్యుదాఘాతంతో గొర్రె మృతి

పోరుమామిళ్ల : మండలంలోని వెంకటాపురంలో విద్యుదాఘాతంతో ఓ గొర్రె మృతి చెందింది. వెంకటాపురంలో ప్రధాన రహదారి పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. గ్రామానికి చెందిన కమ్మనెత్తి పెద్ద ఓబులేసు గురువారం రాత్రి 7 గంటల సమయంలో గొర్రెలు తోలుకుని ఇంటికి వెళుతుండగా.. ఓ గొర్రె ట్రాన్స్‌ఫార్మర్ సమీపానికి వెళ్లింది. షాక్ తగిలి చనిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో విద్యుత్ ప్రసారం అవుతున్నట్లు గ్రహించిన గ్రామస్తులు మిగతా గొర్రెలు అటుగా వెళ్లకుండా పక్కకు తోలారు.

ప్రమాదంలో గాయపడ్డ టీ దుకాణ యజమాని మృతి

మదనపల్లె : గ్యాస్ సిలిండర్ పేలి తీవ్రంగా గాయపడ్డ సీటీఎం–2 పంచాయతీ నేతాజీకాలనీకి చెందిన టీ దుకాణ యజమాని ఎం.బాబు(45) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈనెల 17న రాత్రి నేతాజీకాలనీలోని తన ఇంట్లో బాబు చికెన్ వేడి చేసుకునేందుకు గ్యాస్ స్టౌ వెలిగించగా ప్రమాదవశాత్తూ సిలిండర్ పేలింది. ఈ ప్రమాదంలో బాబు తీవ్రంగా గాయపడగా కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం చెన్నైలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స ఫలించక బాబు గురువారం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

బీహార్‌వాసిపై కేసు నమోదు

కడప కోటిరెడ్డిసర్కిల్ : బీహార్ రాష్ట్రం దర్బాంగకు చెందిన షకీల్‌బిన్ హనీఫ్‌పై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ సిద్ధయ్య తెలిపారు. షకీల్‌బిన్ హనీఫ్ మహ్మద్ ప్రవక్త బోధనలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తూ ముస్లిం వర్గంలో అంతర్గత సంఘర్షణలకు కారణమవుతున్నాడని మత పెద్దల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కేబుల్ ఆపరేటర్లను దూషించిన వ్యక్తిపై ఫిర్యాదు

కడప కోటిరెడ్డిసర్కిల్ : టీవీ సరిగా రావడం లేదని రిపేర్ కోసం కేబుల్ ఆపరేటర్లు వెళ్లగా అతడిని ఇంటి యజమాని దూషించడంతో అతడిపై కేబుల్ ఆపరేటర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కడప నగరం తాలూకా పోలీసుస్టేషన్ పరిధి రవీంద్రనగర్‌లో హాజీవలీ అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. వారి ఇంట్లో టీవీ రాకపోవడంతో రిపేరు కోసం నెట్–9 కేబుల్ ఆపరేటర్లు బాలాజి, వంశీ వచ్చారు. వారితో హాజీవలీ మాట్లాడుతూ మీ నెట్‌వర్క్ సరిగ్గా పనిచేయదని, మీ మేనేజర్‌ను పిలిపించాలని, లేకుంటే చంపుతానని బెదిరించాడు. ఈ విషయమై నెట్–9 కేబుల్ నెట్‌వర్క్ మేనేజర్ రామోజీబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కడప తాలూకా ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.